క్లుప్తంగా

విద్యార్థులకు వాహన సౌకర్యం



ఉదయగిరి: బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు సుదూర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహాయసహకారాలతో వాహన సౌకర్యాన్ని కల్పించారు. గురువారం పాఠశాల ఆవరణలో బండగానిపల్లి సర్పంచ్ లక్కు రమణమ్మ, పీఎంసీ చైర్మన్ అనిత మినీ వ్యాన్‌ను ప్రారంభించారు. హెచ్ఎం నాయబ్ ,ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దర్గా ఈఓకు సన్మానం




అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట దర్గా ఈఓ హుస్సేన్‌ను ముస్లింలు గురువారం ఘనంగా సత్కరించారు.పవిత్ర రంజాన్ మాసంలో స్థానికులు, భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంపై వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో ఈఓతో పాటు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావన్, అకౌంటెంట్ ఖాజాహుస్సేన్‌ను సన్మానించి అభినందించారు. స్థానిక ముస్లింలు సయ్యద్ రఫీ, సయ్యద్ జమీర్, సయ్యద్ ఆబిద్, మహమ్మద్ షకీల్, సయ్యద్ రహమత్ నవాజ్, షేక్ జంషీద్, ఎండీ మొబిన్, షేక్ ఫరీద్, పఠాన్ ఇర్ఫాన్ ఉన్నారు.

వేణుగోపాలుడికి శేష వాహనసేవ



ఆత్మకూరురూరల్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మహిమలూరులోని పురాతన రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి బుధవారం అర్ధరాత్రి శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైభవంగా హనుమంత సేవ



వరికుంటపాడు: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి హనుమంతసేవను వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలుగా మామిళ్లపల్లి ప్రసాద్ వ్యవహరించారు.

నేత్రపర్వంగా శేష వాహన సేవ



ఆత్మకూరు: పట్టణంలోని ఆర్యవైశ్య కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు గురువారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు అంకురార్పణ, శేష వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా దోర్నాదుల వెంకట చలం కుటుంబీకులు వ్యవహరించారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



అల్లూరు: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సౌజన్య, సూపర్‌వైజర్ ఏ రాజేశ్వరి సూచించారు. స్థానిక అల్లిమడుగు కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషకాహార పక్షోత్సవాల్లో వారు పాల్గొన్నారు. గర్భిణులు రక్తహీనతను అధిగమించేందుకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలు లలితమ్మ, ఆశావలంటీర్ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణం

- పరిమితికి మించి ఆటోలు, ట్రాక్టర్లలో ప్రయాణం
- ప్రాణాలను మీదకు తెచ్చుకుంటున్న కూలీలు, ప్రయాణికులు



ట్రాక్టర్ ట్రక్కు డోర్లపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న పొగాకు కూలీలు

కొండాపురం : మండలంలో ప్రయాణికులు, వ్యవసాయ కూలీలు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ట్రాక్టర్లు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాక్టర్ ట్రక్కుపై 40 నుంచి 50 మంది, ఆటోలో 12 నుంచి 16 మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. వ్యవసాయ కూలీలతో పాటు తిరునాళ్లు, జాతరలు తదితర కార్యక్రమాలకు ట్రాక్టర్లపై ప్రయాణించే వారు ఎక్కువయ్యారు. ట్రాక్టర్ ట్రక్కుల డోర్లను సైతం ఓపెన్ చేసి వాటిపై కూర్చుని మరీ ప్రయాణిస్తూ ప్రాణాలను మీదకు తెచ్చుకుంటున్నారు. కుటుంబ సభ్యులకు తీరని వ్యథను మిగులుస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న వాహనదారులపై కొరడాఝళిపించాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ప్రయాణికులు, వాహనదారులకు తూతూ మంత్రంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు.

తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా..

ఇటీవల ఆటోలు, ట్రాక్టర్లు పరిమితికి మించి ప్రయాణికులు, కూలీలతో వెళ్తున్న క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆయా ఘటనల్లో ఎంతో మంది గాయాలపాలై అంగవైకల్యం పొందుతున్నారు. అయినా ప్రజలకు మాత్రం కనువిప్పు కలగడం లేదు. గతేడాది మండలంలోని వెలిగండ్ల వద్ద కూలీల ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే తూర్పుఎర్రబల్లి వద్ద కూలీల ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు కూలీలు గాయపడ్డారు. అలాగే రేణమాల వద్ద ఆటో అదుపుతప్పి బైక్‌ను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి.

ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లు నడుపుతున్న మైనర్లు

మైనార్లు, లైసెన్సులు లేని వారు ట్రాక్టర్లు, బైక్‌లను నడుపుతున్నారు. ఆటోలు, ట్రాక్టర్లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెనుక నుంచి హారన్ కొడుతున్నా వినిపించనంత అధిక సౌండ్‌తో పాటలు వింటూ డ్రైవింగ్ చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలపైన మైనర్లు మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. ఈ క్రమంలో వాహనాలను అదుపు చేయలేక ప్రమాదాల బారినపడుతున్నారు. గ్రామీణ ప్రాంత రోడ్లపై పోలీసులు, రవాణాశాఖ అధికారులు తనిఖీలు లేకపోవడంతో మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని వారు ఇష్టారాజ్యంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తరచూ తనిఖీలు నిర్వహిస్తూ ప్రమాదకరంగా ప్రయాణించే వారిపై చర్యలు తీసుకుని ప్రమాదాలను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బోల్తా పడిన కూలీల ఆటో (ఫైల్)

ఆలయ జీర్ణోద్ధరణ పనుల ప్రారంభం

ఉదయగిరి: పట్టణంలోని మంగలికట్ట ప్రాంతంలో పురాతన శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను గురువారం ప్రారంభించారు. ప్రముఖ సిద్ధాంతి సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ దేవదేవేరుల రాతి విగ్రహాలను బాలాలయంలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యానాదులకు ఆధార్‌కార్డులు ఇవ్వాలి

కావలి : యానాదులకు ఆధార్‌కార్డులు ఇవ్వాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి కోరారు. ఈ మేరకు కావలి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు యానాదులతో కలిసి గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. కావలి డివిజన్‌లో దాదాపు 500మందికిపైగా యానాదులకు ఆధార్‌కార్డుల లేవని తెలిపారు. దీంతో సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని విన్నవించారు.స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ ఆధార్‌కార్డులు లేని యానాదులను తీసుకొని వస్తే ప్రత్యేక డ్రైవ్ కింద మంజూరు చేయించి సంక్షేమ పథకాలు అందేలా కృషిచేస్తామని తెలిపారు. జెడ్డా వాసు, జరుగుమల్లి విజయరత్నం, జె శ్రీనివాసులు, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి

ఆత్మకూరురూరల్: ప్రభుత్వాలు అందజేస్తున్న ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని ఆత్మకూరు ఏడీఏ దేవసేన, ప్రకృతి వ్యవసాయం ఏడీ మునిరత్నం సూచంచారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో గురువారం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా రైతులకు సాగు ఖర్చులు తగ్గుతాయన్నారు. అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. మహిళా సంఘాలకు ప్రకృతి వ్యవసాయం విధానాలను తెలియజేసి వారి ఆర్థిక పరిస్థితి మెరుగయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వెలుగు ఏసీ రత్నమ్మ, వ్యవసాయ అధికారి కిషోర్ బాబు, ఏపీఎం హరి, ప్రకృతి వ్యవసాయం ఎంసీ పద్మమ్మ, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఖరీఫ్ సీజన్‌కు యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాగులు, సజ్జలు, కొర్రలు, ఉదలు, సాములు, ఆరికలు, తదితర పైర్ల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. తహసీల్దార్ సుభద్ర, సీడీపీఓ సునీత, ఏపీయం ఖాజారంతుల్లా, వ్యవసాయాధికారి చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



ఆత్మకూరు: మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డిని ఆత్మకూరుకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని నివాసంలో విక్రమ్‌రెడ్డిని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, తదితరులు కలిసి శాలువాతో సత్కరించారు. ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, సీహెచ్‌సీ వెంగళరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి





ఆత్మకూరు, ఉదయగిరి డిపోల ఎదుట ధర్నా చేపడుతున్న ఎస్‌ఎంయూ నాయకులు

ఉదయగిరి/ఆత్మకూరు: ఉదయగిరి, ఆత్మకూరులోని ప్రజా రవాణా సంస్థ డిపోల ఎదుట ఎస్‌ఎంయూ నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ధర్నా చేపడుతున్నామని వారు తెలిపారు. ఆర్టీసీలో పనిచేసే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, మెరుగైన ఈహెచ్ఎస్‌ను అమలు చేయాలని, మహిళా కండెక్టర్లు, గ్యారేజీ కార్మికులు, తదితరుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎంయూ రీజనల్ సెక్రటరీ మురళీమోహన్‌రెడ్డి, ఆత్మకూరు డిపో అధ్యక్ష, కార్యదర్శులు మస్తానయ్య, శీనయ్య, మహిళా నేతలు పద్మ, మంజుల, బీబీజాన్, సులోచన, ఉదయగిరి నాయకులు వెంకటేశ్వర్లు, శివశంకర్, కాశీవిశ్వనాథ్, కే రాములు, ఫణికుమార్, సలాం, మునీర్, ఏడుకొండలు, రసూల్ పాల్గొన్నారు

భూసమస్యపై తహసీల్దార్ విచారణ

దుత్తలూరు: మండలంలోని జంగాలిపల్లిలో భూసమస్యపై తహసీల్దార్ యనమల నాగరాజు గురువారం విచారణ జరిపారు. తన పొలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, ఆన్‌లైన్‌లో పేర్లు సైతం నమోదు చేసుకున్నారని, తన పొలాన్ని తిరిగి ఇప్పించాలని కోరుతూ గ్రామానికి చెందిన వీరరాఘవరెడ్డి తన నలుగురు పిల్లలతో కలిసి నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట బుధవారం బైఠాయించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ గురువారం గ్రామానికి చేరుకుని గ్రామ సభ నిర్వహించి గ్రామస్తులను విచారించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ నాగరాజు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, అతని వద్ద పొలానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు, సర్టిఫికెట్లు లేవని చెప్పారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు.

రాజకీయ నాయకులతో సమావేశం

ఉదయగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఉదయగిరి నియోజకవర్గ ఏఈఆర్వో సుభద్ర గురువారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదుకు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు.

పరామర్శ



రాఘవరెడ్డిని పరామర్శిస్తున్న విక్రమ్‌రెడ్డి

సోమశిల: అనంతసాగరం మండలం లింగంగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతా రాఘవరెడ్డిని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల కాలు విరగడంతో కేతా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేతా ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తొలుత సోమశిలలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండుబోయిన వెంకటరమణ ఇంటికి వెళ్లి ఇటీవల వివాహం చేసుకున్న ఆయన కుమార్తె భార్గవి, ప్రశాంత్‌కుమార్ దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు బిజివేముల పిచ్చిరెడ్డి, నాయకులు బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి, రెడ్డిమళ్ల ప్రభాకర్‌రెడ్డి, సడ్డా రవీంద్ర, తదితరులు ఉన్నారు.

రామమందిరంలో ప్రత్యేక పూజలు



కావలి : శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని పాతఊరు దొడ్లవారి వీధిలో ఉన్న సీతారామస్వామి మందిరాన్ని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జలదంకి: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా బ్రాహ్మణక్రాక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు కలిగిరి ఏడీఈ కృష్ణమోహన్ గురువారం తెలిపారు. బ్రాహ్మణక్రాకతో పాటు కమ్మవారిపాళెం, చామదల, బీకేఅగ్రహారం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు ఏపీ రైతు సంఘ ఆవిర్భావ దినోత్సవం

ఆత్మకూరురూరల్: పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లోని సచివాలయం వద్ద చేవూరు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘ మండల కార్యదర్శులు పీ కృష్ణమోహన్, లక్కు కృష్ణప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు సమస్యల అజెండాగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పులి వాహనంపై సంగమేశ్వరుడు



సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆదిదంపతులు పులి వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. అర్చకులు దేవదేవేరులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పులి వాహనంపై కొలువుదీర్చి పూలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. కాగా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ కళాకారుడు హేమంత్‌కృష్ణ ముక్కుతో ఫ్లూట్‌ను వాయించి అలరించాడు. ఈ ఆలయ చైర్మన్ గునుపూడి గిరి, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయాభివృద్ధికి సహకరించాలని వినతి

వింజమూరు(ఉదయగిరి): నెల్లూరులోని నివాసంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడిని నల్లగొండ్ల గ్రామస్తులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నల్లగొండ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రసాదం' పథకం ద్వారా నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన వెంకయ్యనాయుడు కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే నిధులు మంజూరయ్యేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ అంకినపల్లి ఓబులరెడ్డి, ఆలయ మాజీ ధర్మకర్తలు లెక్కల పెదకొండారెడ్డి, లెక్కల చినకొండారెడ్డి, ప్రస్తుత ధర్మకర్త అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



నేడు అయ్యప్పస్వామి పడిపూజ

కలిగిరి: మండలంలోని జిర్రావారిపాళెం తిప్పవద్ద నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి మందిరంలో అయ్యప్పస్వామి జన్మించిన రోజును పురస్కరించుకుని శుక్రవారం అంబలం పడిపూజను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటల నుంచి తిప్ప నుంచి కలిగిరి తహసీల్దార్ కార్యాలయం వరకు గ్రామోత్సవం నిర్వహించన్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా -నలుగురికి గాయాలు

సోమశిల: అనంతసాగరం సమీపంలో గురువారం రాత్రి ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు మండలానికి దేపూరు గ్రామానికి చెందిన షేక్ సమీర్ కుటుంబసభ్యులతో కలిసి అనంతసాగరంలోని దర్గాను దర్శించుకుని తిరిగి ఆటోలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో అనంతసాగరం పీహెచ్‌సీ సమీపంలో ఆటోకు హఠాత్తుగా గేదెలు వచ్చాయి. డ్రైవర్ వాటిని తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో సమీర్‌కాలు దెబ్బతింది. ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

విచ్చలవిడిగా అశ్లీల నృత్యాల ప్రదర్శన

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలోని గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాల పేరుతో అశ్లీల నృత్యాలను విచ్చలవిడిగా ప్రదర్శిస్తున్నారు. వరికుంటపాడు మండలం కాకొల్లువారిపల్లిలో రెండ్రోజుల క్రితం అశ్లీల నృత్యాలను ప్రదర్శించారు. ఆ సమయంలో ఓ యువకుడు వీడియో తీస్తుండగా గ్రామస్తులు పట్టుకుని దేశ శుద్ధి చేశారు. సాక్షాత్తు పోలీసుల సమక్షంలోనే ఈ ఘటన జరిగినట్లుగా సమాచారం. అనంతరం ఉదయగిరి సీఐ వెంకట్రావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రదర్శనను నిలిపివేయించినట్లు తెలిసింది. వరికుంటపాడు, రామాపురం, వింజమూరు మండలం గోళ్లవారిపల్లి, బత్తినవారిపల్లి, తదితర గ్రామాల్లో అశ్లీల నృత్యాలను ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సందర్భంగా కొన్నిచోట్ల మద్యం సేవించిన యువత ప్రవర్తన శృతిమించి గొడవలు చోటు చేసుకుంటున్నాయి. వాస్తవంగా అశ్లీల నృత్యాలకు అనుతులు లేనిప్పటికీ డీజేలు, బేబీ డ్యాన్స్‌ల పేరుతో పోలీసు స్టేషన్లలోని ఎస్సైలను మేనేజ్ చేసుకుని పర్మిషన్లు తీసుకుని ప్రదర్శిస్తున్నట్లుగా తెలిసింది. కొన్ని గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు అధికార దర్పంతో అనుమతులు తీసుకోకుండానే ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పోలీసులు తగిన చర్యలు తీసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

సీతారామపురం : ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షను 21వ తేదీకి వాయిదా వేసినట్లు సీతారామపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ షేక్ ముజిబుర్ రెహమాన్ గురువారం తెలిపారు. ఈ నెల 20న ఈస్టర్ పర్వదినం కావడంతో ప్రవేశ పరీక్ష తేదీని మార్పు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు మార్పును గమనించి 21వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షకు హాజరుకావాలని కోరారు. హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఫైలేరియా కిట్ల పంపిణీ

అనుమసముద్రంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా బాధితులకు ప్రత్యేక కిట్లను వైద్యాధికారులు సురేష్‌బాబు, మంజులమ్మ గురువారం పంపిణీ చేశారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఖాదర్‌బాషా, ఎంపీహెచ్‌ఈఓ చిన్నయ్య, ఎంపీహెచ్ఎస్ కుమారి పాల్గొన్నారు.

ఉదయగిరిలో ఓ మోస్తరు వర్షం

ఉదయగిరి: నియోజకవర్గంలోని వింజమూరు, ఉదయగిరి, దుత్తలూరు, కొండాపురం, కలిగిరి మండలాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వేళ ఒక్కసారిగా అకాశం మేఘావృతమై మెరుపులు, ఉరుములు, గాలులతో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రతో అల్లాడిన ప్రజలు సాయంత్రం వర్షం పడి వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ఉపశమనం పొందారు. మెట్టపైర్లు, ఉద్యాన పంటలకు వర్షం నష్టం కలిగించే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా పలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వింజమూరు, బత్తినవారిపల్లి, గుండెమడకల, వరికుంటపాడు, తదితర ప్రాంతాల్లో ఉత్సవాలకు అసౌకర్యం ఏర్పడింది.

పాఠశాలను విలీనం చేయొద్దని నిరసన



సీతారామపురం: స్థానిక పడమటి వీధి ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను వేరే పాఠశాలలో విలీనం చేయొద్దని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యావనరుల కేంద్రం ఎదుట గురువారం నిరసన తెలిపారు. 3,4,5 తరగతులను సుదూర పాఠశాలలో విలీనం చేస్తే విద్యార్థులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పడమటివీధి పాఠశాలలోని తరగతులను వేరే పాఠశాలలో విలీనం చేయడం లేదని ఎంఈఓ మస్తాన్‌వలీ స్పష్టం చేయడంతో నిరసనను విరమించారు.

ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని వినతి



నగదును అందజేస్తున్న సులోచనమ్మ

సీతారామపురం : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన తమకు ప్రభుత్వ సాయాన్ని అందించి ఆదుకోవాలని సీతారామపురానికి చెందిన గుజ్జుల శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ పీవీకృష్ణారెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. తాము తమ పిల్లలను బంధువుల సంరక్షణలో ఉంచి జీవనోపాధి కోసం తిరుపతి వెళ్లామని తెలిపారు. ఈ నెల 7న పోస్టాఫీసు సమీప వీధిలోని తమ ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి సర్వం కాలిపోయాయని,. సుమారు రూ.2 లక్షల మేర నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ విచారించి న్యాయం చేస్తామన్నారు. కాగా గుజ్జుల శ్రీనివాసులు కుటుంబానికి జనసేన పార్టీ నాయకురాలు బోగినేని సులోచనమ్మ రూ.10 వేలు సాయం అందజేశారు.

రక్తదాన శిబిరం



కావలి: పట్టణంలోని శ్రీలక్ష్మి కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి 31 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 43వసారి రక్తదానం చేసిన డాక్టర్ కే మాధవరెడ్డిని రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదన్‌రావు, రోటరీ క్లబ్ ఆఫ్ కావలి కార్యదర్శి మొగల్‌సలీంబేగ్ అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ కే మాధవరెడ్డి మాట్లాడుతూ కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోని తలసేమియా డే కేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.

పాలిసెట్ స్టడీ మెటీరియల్ పంపిణీ

కావలి: పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను వెంకటేశ్వర విశ్వవిద్యాలయ రీజియన్ ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాలిసెట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. శుక్రవారం విశ్వోదయ బాలికోన్నత పాఠశాలలో ఉచిత శిక్షణ పొందుతున్న బ్యాచ్‌కు స్టడీమెటీరియల్‌ను అందజేయనున్నారు. కాగా పాలిసెట్-2025 దరఖాస్తునకు ఈ నెల 15వతేదీ చివరి గడువని తెలిపారు.

